క్లుప్తంగా

అగ్రిగోల్డ్ బాధితుల వినతిపత్రం



ఎమ్మెల్యే సిద్దారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకుపోవాలని బుధవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కొంతమందికి మాత్రమే చెల్లింపులు జరిగాయన్నారు. అందరికీ చెల్లింపులు జరిగే విధంగా కృషి చేయాలని అందులో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం నాయకులు అత్తార్ మహబూబ్‌బాషా, దాదాపీర్, ఫక్రుద్దీన్, ఆనంద్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శకుంతల బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు. సమయ పాలన సరిగా లేని ఉద్యోగుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. సేవాభావంతో పనులు చేసి పెట్టాలని తెలిపారు. యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. వలంటీర్లు అలసత్వం వహించకుండా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేర్చాలన్నారు. వారంలో 3 సార్లు కచ్చితంగా సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అనంతరం పోలేవాండ్లపల్లి గ్రామంలో రైతు గోవిందు రెడ్డి పొలంలో మామిడి మొక్కలను ఎంపీడీఓ పరిశీలించారు.

నివాళి



నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని గరుగుతండాకు చెందిన మంగళమడక పంచాయతీ ఉప సర్పంచ్ నారాయణస్వామి నాయక్ (48) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, బయపరెడ్డి, కిరణ్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అనంతయ్యకు..

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో మంగళవారం రాత్రి ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అనంతయ్య మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటక్రిష్టారెడ్డి బుధవారం కదిరి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లమాడ: పంటల సాగు, చీడపీడల నివారణలో రైతులు క్రిమి సంహారక మందులపై ఆధారపడకుండా యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ సూచించారు. మండలంలోని గోపేపల్లి వద్ద రైతు హైదర్‌వలికి చెందిన సర్వే నెంబర్ 244, న ల్లమాడ సమీపాన రైతు తేజ్‌నాథ్‌రెడ్డికి చెందిన సర్వే నెంబర్ 1103లో సాగుచేసిన వేరుశనగ పంటలో బుధవారం నిర్వహించిన ఈ క్రాప్ బుకి ంగ్, వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాల్లో ఏడీఏ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు ఈ క్రాప్ బుకింగ్ తక్కువ శాతం నమోదు అయిందని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ క్రాప్ బుకింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వేరుశనగలో పురుగు మందుల జోలికి వెళ్లకుండా ఆకులు కత్తిరించే ప్రయోగం చేస్తే ఆశించిన పురుగులు నశిస్తాయన్నారు. వేరుశనగ ఆకులు తిరిగి చిగురిస్తాయని, అలాగే ఒక ఎకరం పంట పొలానికి ఒక లీటర్ వేపనూనె పిచికారీ చేయడం వల్ల కీటకాలు నశించి రైతుకు పెట్టుబడి కూడా తగ్గుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి సుమతి, రైతు భరోసా సహాయకులు మహేష్, నిర్మల, వినోద్, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు



బత్తలపల్లి: నిమజ్జనానికి విగ్రహాలు తరలిస్తున్న దృశ్యం



తలుపులలో భక్తుల కోలాహలం



కొత్తచెరువులో యువత సందడి

- ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం
- వెల్లివిరిసిన ఆనందోత్సాహం

ధర్మవరం అర్బన్: మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. పట్టణంలోని పలు వార్డుల్లో కొలువైన గణపయ్యల వద్ద యువకులు కేరింతలు కొడుతూ డాన్స్‌లు చేశారు. ప్రజలు భక్తిశ్రద్ధల నడుమ నిమజ్జనానికి తరలించారు. రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

గాండ్లపెంట: మండలంలో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. గణనాథుని ప్రతిమలను పురవీధుల గుండా ఊరేగిస్తూ యువకులు రంగులు చల్లుకుంటూ జై గణేశా.. జైజై గణేశా అంటూ కేరింతలు చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామిని గంగమ్మ ఒడికి చేర్చారు.

బత్తలపల్లి: మండలంలో కొలువైన వినాయక విగ్రహాలను బుధవారం భక్తులు వైభవంగా నిమజ్జనం చేశారు. ట్రాక్టర్లను అందంగా ముస్తాబు చేసి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా కాలుస్తూ భక్తులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రంగులు చల్లుకుంటూ కేరింతలతో ఉల్లాసంగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇన్‌చార్జ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పోట్లమర్రి, గంటాపురం, మాల్యవంతం, చీమలనాగేపల్లి, అప్రాచెరువు, తంబాపురం, రామాపురం, నల్లబోయనపల్లి, ముష్టూరు, రాఘవంపల్లి, ముద్దనపల్లి, కాటమకుంట, సంజీవపురం, ఓబుళాపురం, సంగాల, గరిశలపల్లి, దంపెట్ల, డి.చెర్లోపల్లి, గుమ్మల్లకుంట, నెత్తివారంపల్లి, కోడేకండ్ల, రామాపురం తదితర గ్రామాల్లో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

ప్రశాంతంగా ఊరేగింపు..

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. తాడిమర్రి, నిడిగల్లు, పెద్దకోట్ల, మోదుగులకుంట, మద్దల చెర్వు, మరవపల్లి, ఎం.అగ్రహారం, పెన్నదరి, దామాపురం, దాడితోట, చిల్లవారిపల్లిల్లో యువకులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అందంగా అలంకరించి ట్రాక్టర్లు, ఆటోలు, ఎద్దుల బండ్లలో ఉంచి డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు చేస్తూ గణపతిబప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ విగ్రహాలను ఊరేగించారు.

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలను మంటపాలలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. బుధవారం ప్రత్యేక అలంకరణలు చేసి రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాలతో కోలాహలంగా బుక్కపట్నం చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

కదిరి అర్బన్: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక విగ్రహ నిమజ్జనం ఘనంగా జరుపుకున్నారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కట్టెలతండాలో వినాయక విగ్రహం లడ్డూ వేలం పాట నిర్వహించగా గిరినాయక్ రూ.50 వేలతో దక్కించుకున్నారు.

తనకల్లు: మండల పరిధిలోని పలు గ్రామాలలో బుధవారం విగ్రహాల నిమజ్జనాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య పాపాగ్ని నది, పరసర చెరువులు, కాలువలలో గణేశున్ని నిమజ్జనం చేశారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. వినాయకుని నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రావభూపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంతో పాటు రెడ్డివారిపల్లి, ధనియానిచెరువు, ముండ్లవారిపల్లి, ఎదురుదోన గ్రామాలలో కొలువైన వినాయకులను ట్రాక్టర్లలో పురవీధుల గుండా ఊరేగిస్తూ డప్పులు, వాయిద్యాల నడుమ నిమజ్జనానికి తరలించారు. మండల కేంద్రంతో పాటు ముండ్లవారిపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాలలో కొలువైన గణనాథులను వెలిగల్లు జలాశయంలో నిమజ్జనానికి తరలించారు.

- దనియానిచెరువులో లడ్డూతో పాటు చెరకు గడులు, మొక్కజొన్న కంకులు, ఎలక్కాయలు, దానిమ్మ పండ్లకు వేలం నిర్వహించారు. ఇందులో రూ.16,000 వేలకు వేలం పాడి సంతోష్‌రెడ్డి లడ్డూకై వసం చేసుకోగా, బాబు రూ.2,500కు చెరకు, సోము రూ.2,000కు మొక్కజొన్న, సాంబశివ రూ.2,000కు ఎలక్కాయలు, బావాజి రూ.1,000 వేలం పాడి దానిమ్మకాయలను తమ సొంతం చేసుకున్నారు.

జోరుగా వినాయక నిమజ్జనాలు

అమడగూరు: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలను జోరుగా నిర్వహించారు. డప్పు, వాయిద్యాల నడుమ యువకులంతా ఆడిపాడి, చిందులేస్తూ విగ్రహాలను పుర వీధుల గుండా ఊరేగించి జై జై గణేశా అంటూ సమీప చెరువుల్లో నిమజ్జనం గావించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. పలు గ్రామాల్లో వినియక లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఎస్ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తలుపుల: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బుధవారం యువత ఉత్సాహంగా, గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ కేరింతలతో డ్రమ్స్, తప్పెట్లతో బాణసంచా కాల్చుతూ ఊరేగింపుగా వెళ్లి కుంటలు, చెరువులు, బావుల్లో నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మగ్బుల్‌బాష ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిందులు తొక్కుతూ..

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడతో పాటు పలు గ్రామాల్లో బుధవారం గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. నల్లమాడలో 10కిపైగా వినాయకుడి విగ్రహాలను కొలువుదీర్చారు. వైఎస్సార్ కూడలి మరికొన్ని చోట్ల కొలువైన పలు విగ్రహాలను బుధవారం డప్పు వాయిద్యాలు,బాణాసంచా పేలుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకొంటూ డప్పు వాయిద్యాలకు అనుగుణంగా చిందులు వేశారు. అనంతరం గ్రామ సమీపంలోని కుంటలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని పలు గ్రామాలలో వినాయక విగ్రహాల నిమజ్జనాలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మొదట స్వామికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో విగ్రహాలను ఉంచి మేళతాళాలు, డీజే సాంగ్‌లకు డ్యాన్సులు వేస్తూ పిల్లలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారిని ఊరేగించారు. ఉట్టి కొట్టే వేడుక ఘనంగా నిర్వహించారు.

గ్రామాల్లో కోలాహలం..

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా మూడు రోజులు పాటు పూజలందుకున్న గణనాథున్ని బుధవారం నిమజ్జనం చేశారు. యువకులు డ్యాన్సులు చేస్తూ, డప్పులు వాయిస్తూ రంగులు జల్లుకుంటూ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వినాయక విగ్రహాలను వైవీఆర్ డ్యాంలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. కనగానపల్లితో పాటు తగరకుంట, మద్దెలచెరువు, మామిళ్లపల్లి, ముక్తాపురం, తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మూడు రోజులు పాటు పూజలందుకున్న గణపయ్యలను భక్తులు సాయంత్రం ఊరేగింపుగా తీసుకొని వెళ్లి స్థానిక చెరువులు, వంకల్లో నిమజ్జనం చేశారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పాతపాల్యం కొత్తూరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన వేలంలో లడ్డూ ప్రసాదం రూ.40,100 ధర పలికింది. పల్లి నారాయణరెడ్డి కుమారులు అందరికన్నా ఎక్కువ వేలం పాడి లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.



కనగానపల్లిలో..



నల్లచెరువులో ఉట్టి కొడుతున్న యువత



ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లిలో..



ముదిగుబ్బలో కోలాహలం..

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గీతమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు...అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం నేసేవారిపల్లికి చెందిన గీతమ్మ బుధవారం తమ సమీప బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంలో డీ. చెక్కవారిపల్లికి బయలుదేరింది. కొక్కంటిక్రాస్ వద్దకు రాగానే బైక్‌ను ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో గీతమ్మ రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన వందేమాతరం టీం సభ్యులు గీతమ్మను చికిత్స కోసం తమ కారులో తనకల్లుకు, అక్కడి నుంచి కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'రీ సర్వే' పరిశీలన

నల్లచెరువు: మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ రవికుమార్ బుధవారం పరిశీలించారు. యర్రగుంటపల్లిలోని గ్రామ సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులు సర్వే సమయంలో తమ పొలాలకు సంబంధించిన హద్దులను సర్వే అధికారులకు తెలియజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడు, వీఆర్వో ఓబులేసు, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు తదితరులున్నారు.

తక్షణ సాయం అందజేత

అమడగూరు: అమడగూరుకు చెందిన వైఎస్సార్ సీపీ గృహసారథి సైపుల్లా అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు మృతుని కుటుంబానికి జగనన్న బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేశారు. మిగిలిన డబ్బు త్వరలో నామినీ ఖాతాలోకి జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ షబ్బీర్, జూనియర్ సహాయకులు శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

అమడగూరు: మండలంలో ఫార్మర్స్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)కు 3 ఎకరాల స్థలం కేటాయించాలని ఆర్గనేజేషన్ కమిటీ సభ్యులు బుధవారం తహసీల్దార్ వెంకటరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎఫ్‌పీఓ ద్వారా రైతులకు సౌలభ్యకరమైన వాటిని అమలు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో అనువుగా ఉన్న ప్రాంతంలో స్థలాన్ని కేటాయిస్తే వ్యవసాయ గోదాములు నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఆదినారాయణరెడ్డి, నాగరాజు, బొట్టుస్వామి, రాము, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో వడ్డె కులస్తులపై దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ బుధవారం పలువురు రోడ్డుపై బైఠాయించి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ దొరిగిల్లు గ్రామానికి చెందిన కొంత మంది తమ కులస్తులపై కక్ష పెంచుకున్నారన్నారు. అదే క్రమంలోనే వినాయక పండుగ సందర్భంగా గొడవలకు దిగి వడ్డె కులస్తులైన అనంతయ్యను దారుణంగా చంపి మరికొంత మందిని గాయపరిచారన్నారు. పాత్రధారులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐ యతీంద్ర అక్కడికి చేరుకుని వారితో చర్చించి అక్కడి నుంచి పంపివేశారు.

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ఎన్పీకుంట: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మండల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ ఆసియా అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మరికొమ్మదిన్ని, జౌకల గ్రామాలలో బుధవారం వలంటీర్లు, ఏఎన్ఎమ్ లు నిర్వహించిన సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడే వారికి 30వ తేదీ నుంచి నిర్వహించే వైద్యశిబిరంలో చికిత్స పొందడానికి వీలుగా టోకెన్లను అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శాంతమ్మ, ఏఎన్ఎమ్ దేవి, ఆరోగ్యకార్యకర్త ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం సచివాలయం పరిధిలో బుధవారం ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ఆంజనప్ప, సర్పంచ్ లలితమ్మలు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి నమోదు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, శారద, పలువురు పాల్గొన్నారు.

శుభ్రతలో ప్రజలు భాగస్వాములవ్వాలి



రోడ్డుపై చెత్తను ఊడుస్తున్న దృశ్యం

ధర్మవరం: పట్టణ పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ధర్మవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'స్వచ్ఛత లీగ్ 2.0 అండ్ సఫారి మిత్ర సురక్ష సివిర్– ధర్మవరం గ్రీన్స్ గన్నర్స్' ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, శంషాద్‌బేగం, నాయకులు రహదారుల్లో చెత్తను ఊడ్చి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటితోపాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరిచేరవని తెలిపారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల దోమలబెడద అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు కాచర్ల అంజి, చాంద్‌బాషా, చెలిమి పెద్దన్న, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకులకు ప్రత్యేక పూజలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని పీఆర్‌టీవీధిలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి విశిష్ట గణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ధర్మవరం చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందాలని ఎలాంటి సమస్యలు లేకుండా వ్యాపారాలు బాగా జరగాలని వినాయకునికి చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రజలకు చైర్‌పర్సన్ చేతులమీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాచర్ల అంజి, కాచర్ల మంజు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు పాటుపడతాం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్‌లు నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞను మొక్కలు చేత పట్టుకుని చేశారు. మహాత్మాగాంధీ కలలుగన్న దేశం కావాలని, స్వేచ్ఛగా మాత్రమే కాకుండా స్వచ్ఛమైన, పరిశుభ్రమైన దేశంగా ఉంచడం మన బాధ్యత అన్నారు.

అట్టహాసంగా ఎడ్ల బండ్ల పోటీలు



విజేతలకు నగదు అందిస్తున్న పోలీసులు

పుట్టపర్తి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం బుక్కపట్నంలో ఎండ్ల బండ్ల పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొదటి బహుమతి జానకంపల్లికి చెందిన జయరామ్, రెండో బహుమతి గాజులపల్లికి చెందిన సాయి నాయక్, మూడో బహుమతిని జగరాజుపల్లికి చెందిన సత్యప్రకాశ్ ఈదులపల్లికి చెందిన భార్గవరెడ్డి ఇద్దరిని సంయుక్త విజేతలుగా నిర్వాహకులు ప్రకటించారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి కింద రూ.20 వేల నగదు విజేతలకు అందించినట్లు నిర్వాహకులు బాబు రెడ్డి తదితరులు తెలిపారు. పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య,ఎస్ఐ నరసింహుడు బహుమతులందించారు. కార్యక్రమంలో రమణారెడ్డి, తమర్ల సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్

గాండ్లపెంట: స్థానిక ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ అధ్యక్షతన బుధవారం రైతులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర సహకార మంత్రిత్వశాఖ తరఫున పోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సహకార మంత్రిత్వశాఖ నాబార్డ్‌తో పాటు పలు వ్యవసాయ అనుబంధ సంస్థలతో కలిసి రాష్ట్రంలోని సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. రూ.2,516 కోట్లతో సహకార సంఘాల కంప్యూటీకరణ చేస్తోందన్నారు. వచ్చే 5 సంవత్సరాల్లో 2 లక్షల సహకార సంస్థల ఏర్పాటు, రైతులకు రుణాల అందివ్వనుందన్నారు. పంటలను నిల్వ చేసేందుకు గిడ్డంగులు, మీ సేవా కేంద్రాల నిర్వహణ, జనరిక్ ఔషధాల అమ్మకాలు, పెట్రోలు బంకు ఏర్పాటు, పాడి పరిశ్రమ అభివృద్ధి తదితర వ్యాపారాల నిర్వహణతో సంఘాలను బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో పశువైద్యాధికారి కేశవనాయక్, ఎస్‌డీఎసీఓ ప్రభాకరనాయక్, ఏఆర్ మరియాదాస్, ఎస్ఐఎస్‌లు మురళీమోహన్, షాహీన్‌బాషా, కదిరి ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటాచలం, సీఈఓలు షామీర్ బాషా, హనుమంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



కలెక్టర్‌కు డీడీ అందజేస్తున్న కోలా వెంకటరమణ

పుట్టపర్తి అర్బన్: జిల్లా అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తల నుంచి సేకరించిన రూ. లక్ష విరాళాన్ని కలెక్టర్ అరుణ్ బాబుకు బుధవారం దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (డిక్కీ) రాయలసీమ జోనల్ అధ్యక్షుడు కోలా వెంకటరమణ అందజేశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో డీడీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా భావించి జిల్లా అభివృద్ధికి ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తగా మరో 2 వేల ఇళ్ల మంజూరు

కనగానపల్లి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం కనగానపల్లి మండలానికి మరో 2,153 ఇళ్లను మంజూరు చేసిందని జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, భూ పంపిణీ కార్యక్రమాలపై మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం కనగానపల్లి మండలానికి ఇప్పటివరకూ ఆరు వేలకు పైగా ఇళ్లు మంజూరు చేసిందన్నారు. మొదటి రెండు విడతల కింద మంజూరు చేసిన 4 వేల ఇళ్లలో సగానికి పైగా నిర్మాణాలు పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిని గ్రామాల వారీగా కేటాయించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. వీటిని స్థానిక గ్రామాల్లో ఉన్న జగనన్న కాలనీల్లో లేదా సొంత స్థలాల్లో నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. హౌసింగ్, రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పనిచేసి త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రమాదేవితో కలసి భూ పంపిణీ కార్యక్రమంపై రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, డైరక్టర్ ప్రభాకర్, నాయకుడు నాగముని, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ అంకె అశోక్, తదితరులు పాల్గొన్నారు.